# "విశ్వాసము"

శ్రీమతి గరికిపాటి వరలక్ష్మిగారు

నేనుస్కూల్లో చదువుకొనే రోజుల్లో నాతోటివారంతా నన్ను గూర్చి ఒక రకంగా చెప్పుకునే వారు. నేను చాలా బాగా పాడతానట. నాకళ్ళు చాల అందమైనవట. నేను నవ్వితే బుగ్గలు చొట్టె బడతవట. నేను మాట్లాడితే చిన్న పిల్లలు మాట్లాడినట్లుగా ముద్దు వస్తుందట. ఇలా ఎన్నో రకాలుగా నా ఎదుట బయటా కూడా అనుకుంటూ ఉండే వారు. ఆరోజుల్లో నాకు చాల గర్వంగా ఉండేది. నన్ను పొగిడిన ప్రతి స్నేహితురాలికి నే తినే ప్రతి వస్తువులో భాగముండేది. నేను అందకత్తెననే నమ్మకం. దానితో గర్వం నానాటికి నాతో సమానంగా పెరిగింది. నేను కనుపిస్తూ పెరిగాను, నాలో గర్వం కనుపించకుండా పెరిగింది. అంతే తేడా.

స్కూలు మానిపించి, పెళ్ళి ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని ఊళ్ళనుంచి, ఎన్నెన్నో ఫోటోలు, శ్రమపడి తెప్పించారు నాన్నగారు. ఏఫోటో చూచినా నాకు నచ్చేది కాదు. మా అమ్మ ఫోటో తెచ్చి యిస్తూ నిట్టూర్చేది. ఆనిట్టూర్పు యొక్క భావం నా కర్థమయ్యేది కాదు. ఆఫోటో చూచి మాఅమ్మకిస్తూ మూతి విరుచుకునేదాన్ని. ఆమెనా ముఖం వంక, పాలిపోయిన ముఖంతో చూస్తూ ఇలాఅనేది 'నచ్చిందా ఫోటో'. ఆమాటలో ఒకవిధమైన అసంతృప్తి ఉండేది. ఇలా ఎన్ని ఫోటోలో మానాన్న అమ్మకివ్వడం, అమ్మ నాకివ్వడం. అమ్మనుచూస్తే నాకునవ్వు వచ్చేది. అసలు అమ్మకు అందమంటే ఏమిటో తెలియదనుకునేదాన్ని. ఒక రోజు అమ్మను ఇలా అడిగాను. 'యీ ఫోటోలన్ని నాన్నా నువ్వు చూసే నాకిస్తున్నారా?' అమ్మ ఇలా మొదలు పెట్టింది. "నాన్న గారికి నచ్చే నీకు చూపమంటున్నారు. ఇక నాకు నచ్చితే మీకేమి, నచ్చకపోతే మీకేమి మీ నాన్నగారు నామాట వింటారా ఏమన్నాన! అసలు ఇన్ని ఫోటోలు ఎందుకు మీ మామయ్య ఉండగా. నిక్షేపంలాంటి సంబంధం. అదికాదని ఊళ్ళవెంట బడ్డారు మీనాన్న. నాకెందుకులే అమ్మ." అని మాఅమ్మ ఇంట్లోకి వెళ్ళింది. అమ్మ మాటలు విన్న అరగంట వరకు నాతల పని చెయ్యలేదు. మామయ్యను ఊహించుకు చూస్తే, అమ్మమీద నాకసహ్యం గలిగింది. నన్నుకన్న తల్లి ఇంత అపకారం నాకే తలపెట్టిందే అనే క్రోధం నాలో బయలు దేరింది. మామయ్యను అసలీప్రపంచంలో లేకుండా చేద్దామా అనిపించింది. మళ్ళా ఒక్కసారి స్కూల్లో స్నేహితులందరూ జ్ఞాపకమొచ్చారు. నేను అందమైన దాన్ని అన్న మాట గుర్తొచ్చింది. ఇది జరిగిన కొన్ని రోజుల వరకు నాలో ఏమోమో ఆలోచనలు తిరుగుతున్నాయి. నాహృదయంలో బాధ నాకే అర్థం కావడం లేదు.

యీ స్థితిలో అకస్మాత్తుగా మానాన్నగారు పోయారు. నాన్న పోయిన తర్వాత అమ్మకు స్వేచ్ఛ లభించింది. నా విషయం మరీ తీవ్రంగా ఆలోచింపసాగింది. ఆమె జన్మ ఎత్తిన తర్వాత ఏపనిని గురించి పెత్తనం ఇచ్చి ఎరుగరు మా నాన్నగారు. ఇప్పుడు దాగియున్న పూర్తి వికాసం ఆమెలోఉన్న స్వేచ్ఛ బయటకు వెళ్ళ గ్రక్క గలిగింది.

ఇంటి పెత్తనం చేతికిచ్చే సరికి స్వరాజ్యం వచ్చినంతగా భావించింది. నావిషయంలో ఆదిశక్తి రూపం ధరించింది. నన్ను తన తమ్మునకిచ్చి పెళ్ళిచేయుట నిశ్చమైంది. ఆమెకు ఎదురు చెప్పేవారెవరుంటారు. నాకెటు చూచినా దిక్కు కన్పించేది కాదు. అమ్మకు అధికారం ఎక్కువయింది. ఆ అమ్మలంతా నా అదృష్టాన్ని పొగడుతుండే వారు. మామయ్యనన్ను చేసికోవడం, కేవలం నా అదృష్టమేనట. యీ మాటలతో నామతి చెడిపోయింది. అప్పుడెంత ఆలోచించినా స్త్రీలయొక్క దుస్థితి, యీసంఘం, దీనియొక్క కట్టుబొట్లు, హృదయంతో సంబంధంలేని, యీ నిర్బంధపు వివాహాలు, ఎందరు స్త్రీలు ఇలా బలై పోతున్నారో, అన్న భయంకర దృశ్యాలు నాకళ్ళకు కనుపిస్తూ ఉండేవి. ఈ ఆలోచనలతో మాదొడ్లో జామ చెట్టుక్రింద లేసుఅల్లుకుంటూకూర్చున్నాను. అమ్మలక్కలంతా కలసి మా మామయ్యను, నాతో మాట్లాడుటకు పంపారు. వెనుకనుంచి మాటలు. ఏమే లక్ష్మి నా

కొంటవు బనీను అల్లుతున్నావా! అన్నాడు. కలలో విన్న మాటలు వలె నున్నాయి. భ్రమ అనుకున్నాను. తిరిగి చూడలేక పోయాను. మరుక్షణంలో నల్లటి మసిబొమ్మ మామ ప్రత్యక్షమయ్యాడు. ఆముఖంలో తెల్లటి పలువరస తప్ప, ఇంకేమి కనుపించుట లేదు. ఆముఖం చూడగానే నాకళ్ళు విరక్తిచెందినట్లుగా మూతలు పడ్డాయి. మళ్ళీ కాసేపటికి ఇలా వినుపించాయి. 'ఎందుకు కళ్ళుమూసుకొన్నావు. నన్ను చూస్తే సిగ్గేస్తుందా? ఇంక రెండు మూడు రోజులలో నీవు నా లక్ష్మివౌతావు. యీ సిగ్గు అప్పుడెక్కడికి పోతుందో చూస్తాను. ఈ మాటలు వినగానే అప్రయత్నముగా యిలా అన్నాను. 'ఇక నిన్ను చూడను. ఈ కళ్ళు శాశ్వతంగా మూతలు పడే ప్రయత్నం చేస్తాను.' అన్నాను.

కొన్ని సంత్సరాలు ఏంచేశానో, ఎచ్చట ఉన్నానో ఇప్పటికి కళ్ళు తెరిచాను. పది సంవత్సరాలు కళ్ళు మూసుకొని గడిపాను. ఇప్పుడు నాభర్త అందాన్ని చూచి సిగ్గుపడుతున్నాను. ఆరోజు గర్వమే, యీరోజు నాభర్తను చూచుకొని, గర్వపడుచున్నాను. నాలో ఉన్న మనోధైర్యం ఎన్ని కష్టాలనన్న ఎదుర్కొన్నది. నా హృదయం కోరిన భర్తను పొందాను. విధిలేక ఉంటూ ఖర్మ అని తృప్తిపడే స్వభావం కాదుగాబట్టి యీ అదృష్టానికి నోచుకో గలిగాను.

# ఆశీస్సు

(విద్వాన్) వేదుల సత్యనారాయణశాస్త్రిగారు

అక్కాఁమూఁడువసంతముల్ గడపి నిన్నాందాబ్ధివోలార్చితా
ముక్కాల్వన్నెపసిండిగీటుకెనయై ముద్దారులేమోముతో
నిక్కాలంబున చిల్కపల్కులవి యెన్నోయింపుగాపల్కుచున్
పక్కారంగుకుళాయిదాల్చె మహిళాబాలామణీధన్యయై.

సర్వజిద్వర్ష సౌభాగ్యసంపందొంగ
ముగుదముగుదల ముఖముల ముద్దులొల్క
పల్కులెన్నియో తానేర్చి పలుకవలయు
నంచుయాశీస్సు కానుకనందఁజేతు.

ఆంధ్రమహిళకు పుట్టుకనందునాడే
అచటనేయుండి యాశీస్సులందఁజేస్తి
శుక్లపక్షాన చంద్రుని శోభవోలె
వెలుగుగాతంచు మరల యాశీస్సులిడుదు

మహిళాబాలికపలుకులు
నహారహాము తీగవోలెనల్లుకధరపై
మహిళామణులకు తలపై
రహిమించెడిపూవులగుచు రాజిలుగాత ?

★